

గూడూరులో అమలుకాని ఉచిత ఇసుక : సిఐటియు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరులో ఉచిత ఇసుక విధానం అమలు కాకపోవడం వల్ల, భవన నిర్మాణ కార్మికులకు పనులేవని భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య, సేలం శేఖరాచారి, జోగి శివకుమార్, బివి రమణయ్య, ఎస్. సురేష్ మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో ఉచిత ఇసుక విధానం అమలు కాకపోవడం వల్ల మూడు నెలలుగా కుటుంబాలు పస్తులతో ఉంటున్నామని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి, భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

వేడుకగా వినాయక నిమజ్జనం

వినాయక చవితి మూడో రోజు నిమజ్జన కార్యక్రమం అట్టహాసంగా జిల్లావ్యాప్తంగా జరిగింది. అన్నదానాలు, డిజె సాంగ్స్‌కు డ్యాన్సులు, ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో యువత ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. విగ్రహాల ఏర్పాటుకు నిబంధనలు పెట్టినా, చాలాచోట్ల ఉల్లంఘన జరిగింది. చాలా ప్రాంతాల్లో సందుకొకటి, గొంది కొకటి పెడుతూ కనీసం ద్విచక్రవాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా చేశారు. ఏదైనా అనారోగ్యంతో అర్జంట్ వెళ్లాలంటే సందులు, గొందులు తిరుగుతూ దారి పట్టుకుని వెళ్లాల్సి వచ్చింది. దాదాపు మూడు రోజుల పాటు చిరు వ్యాపారాలు స్తంభించిపోయాయి. మూడో రోజు నిమజ్జన కార్యక్రమంలో సగానికి పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. వాకాడు సమీపంలోని తూపిలిపాలెం వద్ద ఘటనలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఒకరు మృతిచెందగా, మరొకరు గల్లంతయ్యారు. మూడో వ్యక్తిని రక్షించారు. నిమజ్జనం చేసేటప్పుడు చెరువులు, సముద్రం వద్ద యువత జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నా, యువత పట్టపగ్గాలు లేకుండా కేకలతో తోసుకుంటూ, డ్యాన్సులు వేస్తూ నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనడం గమనార్హం.

తమ భూములు తమకే ఇవ్వాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో కోటంబేడు గ్రామస్తుల నిరసన

రాయలచెరువులో వైభవంగా...

ప్రజాశక్తి -రామచంద్రాపురం

వినాయక చవితి వేడుకల్లో మూడవరోజు వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. సోమవారం గణేష్ విగ్రహాల నిమజ్జనం నిర్వహించేందుకు రాయల చెరువు కట్ట వద్ద రామచంద్రాపురం ఎస్ఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తుతో పాటు విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. రాయల చెరువులో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు తిరుపతి రూరల్, రామచంద్రాపురం, వడమాలపేట మండలాల నుంచి వివిధ వాహనాలలో విగ్రహాలను యువకులు డప్పుల కేరింతలు కొడుతూ...... జై గణేశ జై జై గణేశ నినాదాలు చేస్తూ తీసుకొచ్చారు. వాహనాలలో తీసుకొచ్చిన విగ్రహాలను పోలీసులు జాగ్రత్తగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జనం చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రమణయ్య, యోబు, ధనుంజయులు, రమేష్, త్యాగరాజులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా సచివాలయంలో ఈ నెల 7న ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ సిబ్బందితో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి సాగనంపారు.

తూపిలపాలెం సముద్రంలో అపశృతి

- ఒకరు మృతి..మరొకరు గల్లంతు
- ఐదుగురిని కాపాడిన గజ ఈతగాళ్లు

ప్రజాశక్తి - వాకాడు (తిరుపతి జిల్లా)

వినాయక నిమజ్జనంలో మృతిచెందిన సాయిక్ ఫయాజ్ మృతదేహం

వినాయక నిమజ్జన వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా నాయుడుపేట కావమ్మ గుడి సెంటర్ నుండి వినాయక నిమజ్జనానికి తూపిలి పాలెం వెళ్లిన వారిలో ముగ్గురు యువకులు సముద్రంలో గల్లంతయ్యారు. వీరిలో సాయిక్ ఫయాజ్ (22) మృతి చెందారు. మునిరాజా(23) ఆచూకీ కోసం గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు. మరో యువకుడిని కాపాడారు. సాయిక్ ఫయాజ్ గూడేపేట కి చెందిన ఖాదర్ బాషా కుమారుడిగా గుర్తించారు. తాను ముస్లిం మతానికి చెందినా స్నేహితులతో కలిసి గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్నాడని సమాచారం. వీరిలో మునిరాజా ఆచూకీ తెలియలేదు. సాయిక్ ఫయాజ్ కాపాడిన కొద్దిసేపటికి తుది శ్వాస విడిచాడు. వారితో పాటు మరో నలుగురిని గజ ఈతగాళ్ల సహాయంతో ఒడ్డుకు చేర్చి కాపాడగలిగారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాకాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వాకాడు ఎస్ఐ పి. నాగబాబు తెలిపారు. సమీపంలో ప్రథమ చికిత్స కేంద్రముంటే ఉపయోగముండేదని ప్రజలు వాపోతున్నారు. నిమజ్జనానికి వెళ్లిన భక్తులు అప్రమత్తంగా ఉండాలని వాకాడు పోలీసులు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

పేదల భూములపై పెత్తందారు పెత్తనం

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్

పేదల భూములపై పెత్తందారు పెత్తనం ఏంటని, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడి, డికెటి భూములు దళితులకే చెందేలా చూడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వి.నాగరాజు మాట్లాడుతూ మండలంలోని కోటంబేడు గ్రామానికి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ లకు 26 మందికి 1999లో డికేటి పట్టాలు ఇచ్చారని, చెట్టు పుట్ట తొలగించి వర్షాధార పంటలు సాగు చేసుకుంటున్న భూములను అదే గ్రామంకు చెందిన ఓ పెత్తందారు బెదిరించి భూములు లాక్కున్నారన్నారు. దీంతో దళితులకు ఎటువంటి ఆధారం, ఆదాయం లేక రోడ్డున పడ్డారన్నారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. పేదల భూములను వారికే ఇప్పించాలన్నారు. లేనిచో నిరసన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో వడ్డేపల్లి చెంగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ గణేష్ నిమజ్జన మహోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం సరోజినీదేవి రోడ్డులోని రామాలయం వద్ద తిరుపతి నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారి కేవల్ వర్మ అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ నిర్వాహకులు ఆర్.ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తుల సహాయ సహకారాలతో ప్రతి వినాయక చవితి సందర్భంగా, తిరువల్ శనివారాల్లోనూ, వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంలోనూ, హిందువుల ముఖ్య పండుగ దినాల్లోనూ, సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, పవన్, విష్ణు, మురళి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లు సస్పెన్షన్, ఎస్ఐకి ఛార్జిమెమో

ప్రజాశక్తి - యర్రావారిపాలెం

నిందితులతో పాటు కుటుంబ సభ్యులపై స్మగ్లింగ్ కేసు పెడతామని బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్లను క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ, ఎస్ఐకి ఛార్జిమెమోను ఎస్పి ఎల్.సుబ్బరాయుడు అందజేశారు. శ్రీగంధం స్మగ్లింగ్ కేసులో నిందితుని భార్యాబిడ్డలను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు పత్రికల్లో వార్తలొచ్చాయి. యర్రావారిపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా శ్రీగంధంను ఆటోలో తరలిస్తున్న ఎనిమిది మంది నిందితులను, శ్రీగంధంను, ఆటోను స్వాధీనం చేసుకుని గతనెల 20న కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఒకరైన గుండ్రాతికుప్పం చంద్రయ్య కుమారుడు సుబ్రమణ్యం కువైట్‌కు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు. అయితే కానిస్టేబుళ్లు దేవేంద్రనాయక్, సి.గుర్రప్పలు ఇదే అదునుగా భావించి చంద్రయ్య భార్య లక్ష్మీదేవి, కుమారుడు సుబ్రమణ్యంలపై స్మగ్లింగ్ కేసు నమోదు చేస్తామని, సుబ్రమణ్యంను కువైట్ పోకుండా అడ్డుకుంటామని బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేశారు. స్మగ్లింగ్ కేసు నమోదు చేస్తామని ఆటోడ్రైవర్‌ను బెదిరించారని విచారణలో నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. ఎస్ఐ ఎర్రిస్వామికి ఛార్జిమెమో జారీ చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ఎవరైనా ఉపేక్షించేది లేదని ఎస్పి హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆదరించండి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రకృతి వ్యవసాయానికి, వాటి ఉత్పత్తులకు మార్కెట్లో మంచి గిరాకీ ఉందని, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు మన ఆరోగ్యానికి ఎంతో మంచివని, వాటిని ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇక నుండి ప్రతి సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసే ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఉత్పత్తుల అమ్మకాలను జిల్లాలోని నలుమూలల నుండి ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారులు, అధికారులు కొనుగోలు చేసి, ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, డిపిఎం షణ్ముగం, ఏపీఎంఐపి పిడి సతీష్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలపై పర్యవేక్షణ ఎక్కడ ... ?

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో 16 బిఇడి కళాశాలలు నడుస్తున్నాయి. వీటన్నింటినీ ఎస్వీయూలోని ఐఏఎస్ఇ కళాశాల పర్యవేక్షిస్తుంది. ఈ కళాశాల ప్రిన్సిపాల్ సదరు ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య, విద్యార్థులు మైక్రో టీచింగ్, అబ్జర్వేషన్ టీచింగ్, బ్లాక్ టీచింగ్ వంటి మూడు రకాల కారకలాపాలను పర్యవేక్షిస్తూ ఉండాలి. సదురు ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎప్పటికప్పుడు ఈ ఐఏఎస్ఈ కేంద్రానికి వచ్చి ప్రిన్సిపాల్ ఆదేశాలను తుచ తప్పకుండా అమలు చేయాల్సి ఉంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ప్రైవేటు బిఈడి కళాశాల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు బయటి రాష్ట్రాలైనటువంటి తమిళనాడు, ఒరిస్సా, ఛత్తీస్గడ్, తెలంగాణ నుంచి విద్యార్థులను అడ్మిషన్ చేసుకోవడం రాష్ట్ర బిఈడి, ఎస్సిఈఆర్టి, ఎన్సిఈఆర్టి నిబంధనలు, విధివిధానాలకు పూర్తిగా వ్యతిరేకం. ప్రైవేటు బిఈడి కళాశాలల్లో అడ్మిషన్లను చేర్చుకునే సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్య కాకుండా బయట రాష్ట్రాల విద్యార్థులను పరిమిత సంఖ్యలో ప్రతి కాలేజీలో అడ్మిషన్లు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ పరిమితి సంఖ్యకు మించి అడ్మిషన్లు చేసుకున్న దాఖలాలు పలు ప్రైవేటు బిఈడి కళాశాలలో ఉన్నాయి. దీనిపై ఎస్వీయూ ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని విద్యార్థి సంఘాలు ఘోషిస్తున్నాయి. ప్రతి సంవత్సరం బిఈడి విద్యార్థులకు మైక్రో టీచింగ్, అబ్జర్వేషన్ టీచింగ్, బ్లాక్ టీచింగ్ వంటి ప్రత్యక్ష బోధన కార్యకలాపాలలో విద్యార్థులు పాల్గొనకుండా విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి ప్రైవేటు బిఈడి కళాశాల ప్రిన్సిపాల్ లు డబ్బులు దండుకొని విద్యార్థుల చేత బ్లాక్ టీచింగ్ చేయకుండానే చేసినట్లు రికార్డులు పంపిస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రత్యేకమైన కమిటీని వేసి ప్రతి బీఈడీ కళాశాలకు ప్రత్యేకమైన సదుపాయాలు, క్రీడా సముదాయము, తరగతి గదుల వాతావరణము ఉన్నాయా లేదో పరిశీలించవలసిన ఆవశ్యకత ఉందని, అటువంటి సదుపాయాలు లేని బిఈడి కళాశాలలను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేనిపక్షంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

16న రాయలసీమ సమగ్ర శిక్షా ఉద్యోగుల సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్

ఈనెల 16న తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాయలసీమ సమగ్ర శిక్షా ఉద్యోగుల హక్కుల సాధన ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ గోడ పత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి. బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శులు జయచంద్ర, ఆర్.లక్ష్మి, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షుడు గండికోట నాగ వెంకటేష్ మాట్లాడుతూ హెచ్ ఆర్ పాలసీ, రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, సమ్మె జీతం, సమ్మె కాలపు అగ్రిమెంట్స్ అమలు కోరుతూ తదితర డిమాండ్ సాధన కోసం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైయస్సార్ కడప జిల్లాల రాయలసీమ ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ఛైర్మన్ ఎ.వి. నాగేశ్వర రావు, రాష్ట్ర ఛైర్మన్ కాంతారావు హాజరు అవుతారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కో-చైర్మన్ డాక్టర్. బొమ్మి నాగరాజు, సమగ్ర శిక్ష జేఏసీ తిరుపతి జిల్లా కోశాధికారి శివ, జిల్లా నాయకులు ధనపాల్ పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో వినతులు పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం (పి.జి.ఆర్.ఎస్) ద్వారా వచ్చే వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 25 వినతులు వచ్చాయి. ప్రజల నుండి వచ్చిన వినతులు స్వీకరించిన అదనపు కమిషనర్ సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన వినతుల్లో ముఖ్యంగా తన బిడ్డకు వికలాంగురాలి పెన్షన్ ఇప్పించాలని, మురుగు కాలువలు శుభ్రం చేయాలని, టిడిఆర్ బాండ్లు ఇవ్వాలని, గహాలు కావాలని, తదితర సమస్యలు ప్రజల నుండి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, సెక్రటరీ రాధిక, డి సి పి శ్రీనివాసులు రెడ్డి, ఆర్.ఓ లు సేతుమాధవ్, కె.ఎల్. వర్మ, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

పూజకు వికలాంగ పింఛన్ ఎందుకివ్వలేదు

గత ప్రభుత్వం అందరికీ పెన్షన్లు ఇచ్చామని డప్పాలు కొట్టుకోవడమే తప్ప 80 శాతం కలిగిన పూజా అనే బాలిక కు ఎందుకు పించన్ ఇవ్వలేదో మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి మునిపల్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డికి అర్హత కలిగిన పూజాకు ఫించన్ ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. తిరుపతి 3 వ డివిజన్ పరిధిలో ఉన్న ప్రగతి నగర్ కాలనీ లో ఉన్న నందిని కుమార్తె పూజ కు 80 శాతం అంగవైకల్యం ఉన్నా వై సీ పీ కక్ష్య సాధింపు లో భాగంగానే ఫించన్ మంజూరు చేయకుండా నిలిపేశారని బాలిక తల్లిదండ్రులు వాపోయారన్నారు. చరణ్ తేజ్ రెడ్డీ స్పందిస్తూ

వికలాంగురాలికి పింఛన్ ఇవ్వలేదని

అప్పుడు ఏం జరిగిందో తెలియదు కానీ ఈ అమ్మాయికి సదరన్ ద్వారా 80 శాతం అంగవైకల్యం ఉంది గనుక తప్పకుండా ఫించన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

వరద బాధితుల సహాయార్థం జీతంలో సగం

వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు చేపడుతున్న సహాయ చర్యలు, అందిస్తున్న ఆపన్న హస్తంకు తోడుగా తాను సైతం తిరుపతి జిల్లా నుంచి తన జీతంలో సగ భాగం ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం అందిస్తున్నానని ప్రకరటించారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం నుండి వివిధ పరిశ్రమల దాతలు, ఇతర దాతల నుండి సుమారు 3 లక్షల వాటర్ బాటిల్స్ పాకెట్స్, 75 వేల పాల ప్యాకెట్లు, జిల్లా మహిళా సమాఖ్య నుండి లక్ష మూడు వేల బిస్కట్ ప్యాకెట్లు, 20 వేలు అగ్గి పెట్టెలు, 20 వేలు కొవ్వొత్తులు వరద బాధితుల సహాయార్థం విజయవాడకి పంపామన్నారు. అలాగే తిరుపతి జిల్లా రెవెన్యూ శాఖ నుండి సుమారు 200 మంది, ఇతర విభాగాల ద్వారా మునిసిపాలిటీ, పంచాయితీ తదితర శాఖల నుండి పలువురు అధికారులు, సిబ్బంది విజయవాడ వరద ముంపు ప్రాంతాలలో సహాయక చర్యలలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా డిఆర్ఓ 25 వేల రూపాయలు చెక్కును కలెక్టర్ కు వరద బాధితుల సహాయార్థం విరాళంగా అందచేశారు.

పక్కాగా ఇంటింటి సర్వే

మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందే ప్రతి అర్జీని నాణ్యతగా, అర్థవంతంగా రీ ఓపెన్ కి తావులేకుండా సకాలంలో పరిష్కరించాలనీ, అలాగే బిఎల్ఓ లు ఎస్ఎస్ఆర్ -2025 ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించి లోపాలు లేని ఫోటో ఎలక్టోరల్ రోల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని పలు శాఖల జిల్లా అధికారులు, మండల, గ్రామ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సబ్ కలెక్టర్ గూడూరు రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, గ్రామ వార్డు సచివాలయ అధికారిణి సుశీల దేవి, డిప్యూటీ సీఈఓ ఆదిశేషా రెడ్డి పాల్గొన్నారు.

17న జాతీయ నులిపురుగుల రెండో విడత

పిల్లలు మానసికంగా, శారీరకంగా దఢంగా ఎదగడం కోసం నులి పురుగుల నిర్మూలన కొరకు ఆల్బెండజోల్ చప్పరించే మాత్రలను తప్పనిసరిగా వాడాలని కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం వైద్య ఆరోగ్య శాఖ వారి నులిపురుగుల నిర్మూలన ఆవశ్యకత పై పోస్టర్ ను ఆవిష్కరించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈనెల 17న రెండో విడత కార్యక్రమం ఉంటుందని, 1-19 ఏళ్ల వయసువ్వు గల వారికి అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్, కళాశాలల్లోని పిల్లలకు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి, ప్రోగ్రాం అధికారిణి ఆర్బీఎస్కే పద్మావతి, డిఈఓ శేఖర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఎస్వీయూలో విసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని అకడమిక్, పరీక్షల విభాగాలను ఉపకులపతి ఆచార్య అప్పారావు ఆకస్మికంగా పరిశీలించారు. పరీక్షల విభాగం, అకడమిక్ విభాగాలలో కొంతమంది సెక్షన్ అధికారులు విద్యార్థులను తమ చుట్టూ తిప్పుకోవడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. వివిధ విభాగాలలో విద్యార్థుల నుంచి మామూళ్లు వసూలు చేసి, అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు కఠినంగా తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షల విభాగం, అకడమిక్ విభాగాలలో పెండింగ్లో ఉన్నటువంటి ఫైల్స్ అన్ని ఏ రోజుకు ఆ రోజు ఇచ్చే విధంగా పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ఆయా విభాగాలలో ఫైళ్ల మందగమనంపై ఆరా తీసి, సంబంధిత అధికారుల నుంచి వివరణ అడిగి తెలుసుకున్నారు. పరీక్ష విభాగంలోని పలువురు సిబ్బందికి సకాలంలో సర్టిఫికేట్లు అందించి విద్యార్థులకు మంచి చేయాలని సూచించారు. వర్సిటీ సిబ్బంది పరిపాలన భవనంలోనే కాకుండా వివిధ విభాగాలలో పనిచేసే సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని, కళాశాల, వర్సిటీ సమయపాలనను పూర్తిస్థాయిలో పాటించాలని, లేనిపక్షంలో అధికారులపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోనని హెచ్చరించారు.

కాపునాడు జిల్లా అధికార ప్రతినిధిగా మురళి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవా సమితి తరపున తిరుపతి జిల్లా కాపు నాయకులు తుపాకుల మురళిని తిరుపతి జిల్లా అధికార ప్రతినిధిగా జాతీయ అధ్యక్షులు మల్లెల శివ నాగేశ్వరరావు నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాపునాడు తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి మురళి మాట్లాడుతూ జిల్లాలో కాపుల అభ్యున్నతికి కషి చేస్తానని చెప్పారు.

'పులి' సాకుతో 'వాత'

రోడ్డునపడ్డ 31మంది చిరువ్యాపారులు
రెండు దశాబ్దాలుగా వ్యాపారమే ఉపాధి
టిటిడి కక్షసాధింపు ధోరణితో పస్తులు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

శ్రీవారి మెట్టు.. ఏడుకొండల స్వామిని దర్శించుకోడానికి అలిపిరితో పోలిస్తే దగ్గరి దారి.. ఈ ఒక్క కారణంతో కొంతమంది భక్తులు శ్రీవారి మెట్టు మార్గంలోనే తిరుమల చేరుకోడానికి ఇష్టపడతారు.. ఈ భక్తులను నమ్ముకుని గత 20 ఏళ్లుగా 31మంది చిరు వ్యాపారులు భక్తులకు కావాల్సినవి చౌకగా అందిస్తూ పొట్ట పోసుకుంటున్నారు. అయితే ఇటీవల తిరుమల కొండల్లో పులి కనిపించిందన్న సాకు చూపి, వీరిని వ్యాపారాలు చేయనీకుండా టిటిడి కక్షసాధింపు చర్యలకు దిగింది.. అడవి జంతువులు ఉంటాయని భక్తులను అప్రమత్తం చేస్తూ, ఎర్రచందనం స్మగ్లర్లు తిరగకుండా కాపలాకాస్తూ, శేషాచలం అడవులను కాపాడుతున్న తమపై కక్షసాధింపు చర్యలేంటని చిరువ్యాపారులు రెండు వారాలుగా టిటిడి పరిపాలనా భవనం ఎదుట నిరసన దీక్షలు చేపట్టినా కనీసం మానవీయ కోణంలోనైనా వారిని పలకరించకపోవడం గమనార్హం.

తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ప్రతి రోజూ లక్ష మందికిపైగా భక్తులు దేశ విదేశాల నుంచి వస్తుంటారు. మొక్కుబడి ఉన్న వారు నడకమార్గంలో తిరుమలకు వెళుతుంటారు. తిరుమలకు వెళ్లేందుకు అలిపిరి, శ్రీవారిమెట్టు నడకదారులు ప్రదానమైనవి. శ్రీవారిమెట్టుమార్గం కొండ ఎక్కేందుకు సులంభంగా ఉండడంతో వృద్ధులు, పిల్లలు, చంటిబిడ్డల తల్లులు, అనారోగ్యంతో ఉన్న వారు ఎక్కువుగా ఈ దారినే ఎంచుకుంటారు. ఈ దారిలో సుమారు 20 సంవత్సరాలకు పైగా 31 కుటుంబాలకు చెందిన వారు సమోసాలు, పబ్బిళ్లలు, బిస్కట్లు, శీతల పానియాలు, టీలు వంటివి భక్తులకు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిపై టిటిడి యాజమాన్యం కక్షకట్టింది. వైపిసి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో వీరిపై దాడి చేసి గాయపరిచిన విషయం విదితమే. టిటిడి యాజమాన్యానికి కోపం వచ్చినప్పుడల్లా వారిపై ప్రతాపం చూపడం మామూలైంది. టిడిపి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా టిటిడి తీరులో మార్పు లేదు. 2019 నుంచి 2024 ఆగస్టు వరకు శ్రీవారి మెట్టు మార్గంలో చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను కేవలం 9 నెలల పాటు మాత్రమే చేసుకోవడం గమనార్హం. 2019లో వైసిపి పాలనలోకి వచ్చాక 7 నెలలు మాత్రమే వ్యాపారాలు సాగాయి. తర్వాత వారిపై దాడుల జరిగాయి. దీనిపై వ్యాపారులు పోరాటం చేస్తున్న సమయంలోనే కరోనా రావడంతో రెండు దఫాలుగా సుమారు 3 సంవత్సరాలు వ్యాపారాలు మూసేశారు. లాక్‌డౌన్ అనంతరం వ్యాపారాలు సాగించే సమయంలో అలిపిరి నడకమార్గంలో మూడు సార్లు చిరుత సంచారం, ఓ చిన్నారి చిరుతదాడిలో మృతి చెందిన ఘటనతో నడకమార్గాలను టిటిడి అధికారులు మూసేశారు. ఆ తర్వాత దశలవారీగా కొన్ని షరతులతో పున్నప్రారంభించారు. దీంతో అలిపిరి మార్గంలో వ్యాపారాలు తెరుచుకున్నాయి. శ్రీవారిమెట్టు మార్గంలో మాత్రం అనుమతి ఇవ్వలేదు. పైగా చిరుత సంచారించిన ప్రాంతంల్లో..చిన్నారి మృతి చెందిన ఘటన ప్రాంతంలోనే కొత్తగా షాపుల ఏర్పాటుకు అధికారులు అనుమితి ఇచ్చారు. ఎలాంటి వన్యమృగాలు సంచారం లేని శ్రీవారి మెట్టుమార్గంలో వ్యాపారాలకు అనుమతి నిరాకరించారు. ఎట్టకేలకు ఎన్నికలు సమీపించడంతో 2024 ఏప్రిల్ నెలలో చిరు వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతించారు. రెండు నెలలు తిరక్కుండానే కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే కొత్తగా వచ్చిన ఈవో మళ్లీ వీరిపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ, వ్యాపారాలకు అనుమతి నిరాకరించారు. ఇదే వ్యాపారులు గతంలో ఎంతో మంది ఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులకు పట్టించడంలో సహకరించారు. నిషేధ వస్తువులు తిరుమలకు వెళ్లనీకుండా వీలైనంత వరకు విజిలెన్స్‌కు సహకరిస్తున్నారు. ఇంత చేస్తున్న టిటిడి వీరిపై కక్షకట్టడం సరైనది కాదు. అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేసారిన చిరువ్యాపారులు తమకు న్యాయం చేయాలని కోరుతూ (సిఐటియు ఆధ్వర్యంలో) 16రోజులుగా ఆగస్టు 21వ తేది నుంచి టిటిడి పరిపాలన భవనం వద్ద నిరసన చేస్తున్నారు. అయినా అధికారుల్లో స్పందన లేదు.

25 సంవత్సరాలుగా వ్యాపారాలే దిక్కు

శ్రీవారి మెట్టుమార్గంలో గత 25 సంవత్సరాలుగా చిరు వ్యాపారులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. టిటిడి అధికారులు మాపై కక్షతో వ్యవహరించడం తగదు. అదికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

-చిట్టిబాబు, అధ్యక్షులు, శ్రీవారిమెట్టు చిరువ్యాపారుల సంఘం,

భక్తులకు మావంతు సహాయం అందిస్తున్నాం

తిరుమలకు శ్రీవారిమెట్టు మార్గంలో వెళ్లే భక్తులకు చిన్న చిన్న వస్తువులు విక్రయించడంతో పాటు, వారికి మావంతు సహాయ సహకారాలు అందిస్తున్నాం. నడవలేని వృద్ధులను ఎత్తుకుని వెళ్లి తిరుమల చేర్చిన సంఘటనలు కోకొల్లాలు. మమ్మల్ను టిటిడి గుర్తించాలి.

-లోకనాథం, కార్యదర్శి, శ్రీవారిమెట్టు చిరువ్యాపారులు సంఘం.

పశు వైద్యాధికారిణికి ఘన సన్మానం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ శిల్పా రెడ్డిని సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి ఓబిసి తిరుపతి పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ మెండు బాల గురవయ్య యాదవ్ మాట్లాడుతూ నిత్యం ప్రజాసేవ చేస్తూ అందరికీ అందుబాటులో ఉంటున్న వెటర్నరీ డాక్టర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను పేదలకు ఎప్పటికప్పుడు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నిమ్మకాయల వేణుగోపాల్, మునస్వామి, ఏర్పేడు వాసులు పాల్గొన్నారు.

రేపు ర్యాలీని విజయవంతం చేయండి: బిఎస్‌పి

ప్రజాశక్తి -కోట: ఎస్సీ వర్గీకరణ ప్రేరణతో రాజ్యాంగ విరుద్ధంగా సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు వర్గీకరించుకోవచ్చన్న తీర్పును నిరసిస్తూ ఈ నెల 11వ తేదీ బుధవారం నిర్వహించనున్న నిరసన ర్యాలీని స్వచ్ఛందంగా విజయవంతం చేయాలని సీనియర్ బిఎస్‌పి నాయకులు పిలుపు నిచ్చారు. కోట మండలంలోని అంబేద్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలకు వెళ్లే మెయిన్ రోడ్డు సిద్ధార్థ బిల్డింగ్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను వ్యతిరేకిస్తున్న బిఎస్‌పి అధినేత బెహన్ జీ మాయావతి, లోక్ జనశక్తి అధినేత చిరాగ్ పాశ్వాన్, భీమ్ ఆర్మీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్, దేశవ్యాప్త ఎస్సీ సంఘాల పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట నిరసన ర్యాలీపై పలు గ్రామాల్లో ఇప్పటికే వివరించామని తెలిపారు. ఈ ర్యాలీకి భారీ సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంట్రంగం వసంత్, దాసరి సుందరం, పనబాక హేమంత్, రంగనాథ్, నాగరాజు, దాసరి అశోక్ కాంత్ పాల్గొన్నారు.

తుపాను బాధిత ప్రాంతాల్లో తహశీల్దారు సేవలు

విజయవాడలో సర్వే బాధ్యతలు నిర్వహిస్తున్న తహశీల్దారు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల తహశీల్దారు వి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విజయవాడలో తుపాను బాధిత ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారు. విజయవాడ లోని 20 వార్డు కృష్ణలంకలో బుచ్చినాయుడు కండ్రిగ తహశీల్దారు సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబు నాయుడు, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున రెడ్డి, వీఆర్‌లు జగదీష్, భాస్కర్ తేజ మరి కొందరు రెవెన్యూ అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వర్ద బీభత్సానికి ఇళ్లలో నష్టపోయిన మంచం, ఫ్రిడ్జ్, టివి, వంట పాత్రలు, ద్విచక్ర వాహనాలు, ఒక కుటుంబానికి అవసరమైన వస్తువుల, వారికి అవసరమైన సామగ్రి ని సర్వే చేసి జాబితాను రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.

వినాయక చవితి సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరు గిరిజన కాలనీలో వినాయక ఉత్సవాలలో భాగంగా సర్పంచ్ మోహన ప్రియ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఏర్పేడు మండలంలోని రాజుల పాలెం ఎస్‌టి కాలనీ పిల్లలకు యువత నేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా దాతల సహకారంతో కొత్త దుస్తులు అసోసియేషన్ అధ్యక్షులు వినోద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు మధురాంతకం శేఖర్, కోఆర్డినేటర్ అరుణ పాల్గొన్నారు. ఏర్పేడు మండలంలోని వికృతమాలలో వినాయక స్వామి లడ్డుకు వేలంపాట నిర్వహించారు. టిటిడి రిటైర్డ్ డిప్యూటీ ఈవో రెడ్డివారి ప్రభాకర్ రెడ్డి 25వేల రూపాయలకు వేలం పాటలో దక్కించుకున్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రతి పంచాయతీలో వినాయక చవితి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆ బీసీ కాలనీలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. లడ్డూ వేలం నిర్వహించారు. సుమారు వంద మందికి పైగా వినాయక కమిటీ యూత్ తరఫున అన్నదానం చేశారు. పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాలలో చంద్రయ్య, వర్ధన్, శివమణి, శేఖర్, పార్థు, సందీప్, చందు , దివాకర్ పాల్గొన్నారు.

ముర్రుపాలతో ఆరోగ్య సమస్యలు దూరం: సిడిపిఓ

ప్రజాశక్తి-వెంకటగిరి:

మాట్లాడుతున్న పిహెచ్‌సి వైద్యులు

చిన్నారులు తల్లులు తమ బిడ్డలకు తప్పని సరిగా ముర్రుపాలను ఇవ్వాలని సిడిపిఓ షంషాద్‌బేగం తెలిపారు. బంగారుపేట పిహెచ్‌సిలో బాలింతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు తమ బిడ్డలను ముర్రుపాలను పట్టించి బిడ్డలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. తల్లిపాలలోనే అనేక పోషకాలు బిడ్డలకు లభిస్తాయన్నారు. బాలింతలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. టీకాను తప్పని సరిగా వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: విద్యాశాఖ మంత్రి లోకేష్ పర్సనల్ సెక్యూరిటీ అధికారి టి వెంకటరమణ, టిడిపి నాయకులు కమ్మది కండ్రిగ కుమార్ , చెల్లూరు వెంకటసుబ్బయ్య , గుడిమల్లం పరశురామేశ్వర స్వామిని సోమవారం దర్శించుకుని అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానానికి టి వెంకటరమణ రూ.10,116లు, కమ్మది కండ్రిగ కుమార్ రూ.5,116 లు, చెల్లూరు వెంకటసుబ్బయ్య రూ .1,116లు అందించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రైవేట్ బత్తల గిరి నాయుడు వారికి కండువా కప్పి స్వామి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సిఏ ప్రవీణ్, టిడిపి నాయకులు సత్యరాజ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయండి

కేంద్రమంత్రికి ఎమ్మెల్యే వినతి

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద సర్వీస్ రోడ్డు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా , రహదారుల శాఖ, షిప్పింగ్ మంత్రి నితిన్ గడ్కరిని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ వినతి పత్రం అందించారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఎమ్మెల్యే సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు- తచ్చూరు 6 లైన్ జాతీయ రహదారి కోసం పుత్తూరు సబ్ స్టేషన్ క్రాస్ రోడ్డు వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. విజయపురం మండలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన సెజ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నందున, సెజ్ ప్రాంతానికి అనువుగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు.

ప్రజాదరణ చూసే అసత్య ఆరోపణలు: జనసేన

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): తన రాజకీయ ఎదుగుదలను, ప్రజాదరణను చూసి ఓర్వలేక సోషల్ మీడియాను వేదికగా చేసుకుని కొందరు ఆధారాలు లేని ఆరోపణలు చేయడాన్ని చంద్రగిరి జనసేన ఇన్‌ఛార్జి దేవర మనోహర్ పేర్కొన్నారు. చంద్రగిరి అర్‌ అండ్‌బి అతిథి గృహంలో సోమవారం ఆయన

మాట్లాడుతున్న జనసేన నాయకులు

మీడియాతో దేవర మనోహర్ మాట్లాడుతూ తిరుచానూరులో కల్లుకుంట పాల్పడు తున్నారని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైసీపీ అవినీతిపై ప్రజాపక్షాన పోరాడి పోరాడుతూ ఉన్నామని గుర్తు చేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో 2019 నుంచి జనసేన పటిష్టతకు తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు కృషి చేసానన్నారు. జనసేనకు లభిస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక వ్యక్తిగత టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. జనసేన లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ శ్యామల ద్వారా తిరుపతి ఎస్పీని కలిసి ఆధారాలతో పాటు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలను అనుగుణంగా కూటమి నేతలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో తిరుపతి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు పగడాల యువరాజ్, ఉపాధ్యక్షుడు వాకా మురళి పాల్గొన్నారు.

నిర్ణీత ఛార్జీలు వసూలు చేయాలి

ఇసుక రవాణా దారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: జిల్లాలో ఇసుక రవాణా చేసే వాహనదారులు జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించిన ధరలకే ఇసుకను సరఫరా చేయాలని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత వాహన దారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గనులు, భూగర్భ శాఖ, రవాణా శాఖ, ట్రాక్టర్లు, లారీ, టిప్పర్లు యాజమాన్యంతో కలెక్టర్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుకను రవాణా చేసే వాహనదారుల నుండి పలు సూచనలు, సలహాలు తీసుకున్న మేరకు రవాణా ఛార్జీలను నిర్ణయిస్తామని తెలిపారు. ఇసుక రవాణా చేసే వాహనదారులు వినియోగదారుల నుండి ఇసుక కమిటీ నిర్ధారించిన రవాణా ఛార్జీలకు లోబడి వసూలు చేయాలని తెలిపారు. ఈ వివరాలను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలో ఇసుక సరఫరాకు సంబంధించిన

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వాహనదారులు పలు సమస్యల గురించి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా గనుల శాఖ అధికారి ప్రకాష్ కుమార్, జిల్లా రవాణా అధికారి వివి సుబ్రహ్మణ్యం, ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ యాజమానులు పాల్గొన్నారు.

పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో దళితులకు, గిరిజనులకు ఇచ్చిన ఇంటి స్థలాలను ఆ గ్రామానికి చెందిన పెత్తందారులు కొంతమంది దళితులను పావుగా వాడుకుని తమిళనాడు ప్రాంత వాసులకు అక్రమంగా అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని వారిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని సత్యవేడు సిపిఎం మండల కార్యదర్శి మెలుగు రమేష్ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మెలుగు రమేష్ మాట్లాడుతూ మధనంబేడులో దళితులు అనుభవంలో ఉన్న భూములపై, దళితుల సంక్షేమం వి ఎస్ ఎస్ కమిటీకి కేటాయించిన భూములపై కన్ను వేసిన అగ్రకులస్తులు ఆ గ్రామంలోని కొంతమంది దళితులను ఎగదోషి వారిపై దాడి చేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వీరిని ప్రశ్నించిన వారిపై అధిక అధికార బలాన్ని ఉపయోగించి తప్పుడు కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ గ్రామంలోని కొంతమంది దళితుల భూవివాదాలపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదయి కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ ఈ భూములపై పెత్తందారులు కబ్జాదారులు దాడులకు పాల్పడడం చట్టాన్ని వ్యతిరేకించడమే అని వ్యాఖ్యానించారు. ఈ అక్రమాలపై చర్యలు చేపట్టాల్సిన

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న దళితులు

స్థానిక రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆనంబేడు గ్రామంలోని దళితుల ఇండ్ల స్థలాలు, అనుభవంలో ఉన్న భూములు పై దాడి చేసి ఆక్రమించి విక్రయించి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని నిరసన తెలిపారు. అనంతరం సత్యవేడు తహశీల్దారుకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మురళి, మునస్వామి కిష్టయ్య, మదనంబేడు గ్రామ దళితులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: స్విమ్స్, శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో దొరవారిసత్రం పిహెచ్‌సి పరిధిలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారి డాక్టర్ వి చైతన్య తెలిపారు. ఇందులో భాగంగా పూలతోట గ్రామ సచివాలయంలో సోమవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహి స్తున్నామని తెలిపారు. ఈ

క్యాంపునకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. దొరవారిసత్రం పిహెచ్‌సి పరిధిలో ఈ నెల 11వ తేదీ తనియాలి, 13న ఉచ్చూరు, 18న నెలబల్లి, 20న కొత్తపల్లి, 23న పోలిరెడ్డిపాడు, 25నఏకొల్లు, 27న వేనుంబాకలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి పద్మావతి, సర్పంచులు ప్రమీల, మణి, పంచాయతీ కార్యదర్శులు మధు, మౌనిక, నర్సింగ్ సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది, ఎంఎల్ హెచ్ పి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోండి: సిపిఎం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు కోరారు. బుడమేరు పొంగడంతో విజయవాడ లోని పలు ప్రాంతాలు జలమయమై వారం రోజులు పైబడి నీటిలోనే మునిగి అవస్థలు పడుతున్న ప్రజలను ఆదుకొని వారి ఆకలి తీర్చాలన్నారు. గూడూరు సిపిఎం, సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం విరాళా లు సేకరించారు. గూడూరు పట్టణంలోని మాయాబజార్ నుండి ప్రారంభించి వివేకానంద రోడ్, ముత్యాల పేట, గాంధీ మున్సిపల్ బిల్డింగ్స్, ఎన్టీఆర్ కాంప్లెక్స్, పూల వ్యాపారస్తులు దగ్గర నుంచి వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించిన మొత్తం ఎనిమిది వేల ఎనిమిది వందల యాభైరూపాయలు దాతలు నుండి సేకరించిన మొత్తం రాష్ట్ర కమిటీకి పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు బివి రమణయ్య, ఎస్‌సురేష్, పామంజీ మణి ,అడపాల ప్రసాద్, పుట్టా శంకరయ్య, సేలం శేఖరాచారి, వినయ్, బి చంద్రయ్య, జాని పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ దుప్పట్లను బాధితులకు అందించేందుకు విజయవాడకు పంపిస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు శీలం కిరణ్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ నుండి విజయవాడ వరద బాధితులకు అందించేందుకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఏర్పాటు చేసిన దుప్పట్ల వాహనాన్ని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు శీలం కిరణ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ వరద బాధితు లను ఆదుకునేందుకు గూడూరు నియోజకవర్గంలో స్వచ్ఛంద సంస్థలు పలు సంఘాలు నాయకులు ఆర్థిక సహాయం అందించారన్నారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ సొంత నిధులతో కొనుగోలు చేసి విజయవాడకు పంపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు , సోమిశెట్టి చెంచురామయ్య , రవీందర్ రెడ్డి , మురళి ,వెంకటేష్ పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

వరద బాధితుల సహాయార్థం రెండు లక్షల 70 వేల రూపాయల ఆర్థిక సాయం చెక్కును ఎమ్మెల్యే సునీల్ కుమార్ కి పలువురు అందించారు. సర్పంచ్ వెంకటేశ్వర్ల నాయుడు 50 వేల రూపాయల చెక్కు, కోట మండలానికి చెందిన టిడిపి నాయకులు రూ.2 లక్షల 25 వేలు , గూడూరు మాజీ మండల ఉపాధ్యక్షురాలు మట్టం శ్రావణి 50 వేల రూపాయలు, శివ కుమార్ రెడ్డి 50 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యేకు అందించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం గూడూరు నియోజకవర్గంలో స్వచ్ఛంద సంస్థలు, నాయకులు స్పందించడం అభినందనీయమన్నారు. 38 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించారని దాతలందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కోట : కోట మండలంలోని తిన్నెలపూడి పంచాయతీకి చెందిన టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మా రెడ్డి వరద బాధితుల కోసం 30 వేల రూపాయలను ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గండవరం సుష్మా రెడ్డి మాట్లాడుతూ గూడూరుటిడిపి ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు విజయవాడ లో వరదలు కారణంగా అతలాకుతలం అయినా వరద బాధితుల కోసం తమ వంతు మానవతా దృక్పథంతో 30 వేల రూపాయలను అందించామని తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాలల్లోనే మెరుగైన వైద్యం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ వైద్యశాలల్లోనే మెరుగైన వైద్యం అందుతోందని బిఎన్‌కండ్రిగ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డియన్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రతి నెల 9, 10వ తేదీల్లో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సురక్షిత్ మైత్రిత్వ అభియాన్ సేవలు గర్భిణులకు వైద్య పరీక్షలు వైద్యాధికారుల ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండ్రిగ పిహెచ్‌సిలో సోమవారం నిర్వహించారు. గర్భిణులకు ప్రాథమిక పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి ధనుర్వాతం వ్యాక్సిన్, వివిధ రకాల మాత్రలు, ఆరోగ్య సలహాలు అందించారు. ప్రతి గర్భిణీ బలవర్ధక ఆహారం తీసుకుని ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేసుకుని తల్లి బిడ్డ సురక్షితంగా ఉండాలని సూచించారు. పిఎంఎంవివై ద్వారా ప్రతి మొదటి కాన్పుకు రూ. ఐదువేలు పొంద వచ్చని, రెండవ కాన్పులో ఆడ శిశువు జన్మిస్తే మరో ఐదువేలు పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో కాన్పు జెఎస్‌వై ద్వారా వెయ్యి రూపాయలు పొందవ చ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపరువైజరు జ్యోతి, ఆశాలు, ఏఎన్ఎం లు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో సలహాలు అందిస్తున్న వైద్యాధికారులు

పుత్తూరు టౌన్ : గర్భిణులు మంచి పౌష్టికాహారం పాలు, గుడ్డు, ఇతర ఆహార పదార్థాలు తీసుకోవాలని పరమేశ్వరమంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కె హేమ భూషణ్ రెడ్డి పేర్కొన్నారు. రూరల్ మండలంలోని పిహెచ్‌సి పరిధిలోని గర్భిణులకు (ఎంపిఎస్ ఎంఎసి ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్) ద్వారా అందరికి రక్త పరీక్షలు నిర్వహించి వారికి తగిన మందులు అందించారు. అవసరమైన వారికి ఈసీజీ తీసి వారికి తగిన చికిత్స అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. 33 మంది గర్భిణులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం డాక్టరు ఎవికె హేమ భూషణ్ రెడ్డి, వైద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈఓ రమేష్ బాబు, పీహెచ్‌ఓవిజయ కుమారి, సూపర్ వైజర్ లలిత, హాస్పిటల్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కోట : కోట మండలం తిన్నెలపూడి పంచాయతీలో ఇటీవల బైన లక్ష్మీదేవి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న స్థానిక టిడిపి జిల్లా తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మా రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి పదివేల రూపాయలను పైన లక్ష్మీదేవి భర్త పైన సుబ్బయ్యకు ఆర్థిక సాయం అందించారు. ఆ కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని నింపారు.ఆర్థిక సాయం అందించినందుకు గండవరం సుష్మా రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేతంరెడ్డి నరేంద్ర రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు చీపినాటి. మల్లికార్జున్, పవన్, తదితర గండవరం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా డిఎస్ గణేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షులు, పుత్తూరు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, సీనియర్ టిడిపి నాయకులు డి ఎస్ గణేష్ పుట్టినరోజు వేడుకలను జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి తెలుగు తమ్ముళ్లు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ఎన్ మాధవ, పుత్తూరు పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు ఏలుమలై రెడ్డి, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ అయ్యప్ప రెడ్డి, జిల్లా బిసి సెల్ కార్యదర్శి

డిఎస్‌గణేష్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

లక్ష్మీపతి, పుత్తూరు పట్టణ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు నవీన్, జిల్లా టి ఎ న్ టి య ు ని ఆర్గనైజింగ్ సెక్రటరీ మణి రెడ్డి, బాల్ రెడ్డి, చొక్కాలింగా రెడ్డి కాశీ, చిదంబరం, నాగరాజు, నారాయణ, మహేష్, జ్యోతి బాబు,గోపాల్, గణేష్, బాలమణి, చిరంజీవి పాల్గొన్నారు.

మహిళల నిరసన

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలను నిరసిస్తూ నారాయణవనం బైబాస్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళలు, టిడిపి, అఖిలపక్ష నాయకులు సోమవారం శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. పలువురు దళిత మహిళలు మాట్లాడుతూ 45 సంవత్సరాల ఆయన రాజకీయ జీవితంలో మచ్చలేని రాజకీయ నాయకుడిగా ఎదిగారని, ఆయనపై పోలీసు స్టేషన్‌లలో ఎలాంటి ఫిర్యాదులు లేవని దీనిపై కుట్రకోణం దాగి వుందని విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాలని కోరారు. అనంతరం నారాయణవనం పోసు స్టేషన్‌కు వచ్చి ఎమ్మెల్యేకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో దళిత మహిళలు, వైసిపి నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు, బిఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై వచ్చిన లైంగిక వేధింపు ఆరోపణలను నిరసిస్తూ కుట్ర కోణం దాగి వుందని దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని కోరుతూ పలువురు నియోజకవర్గ దళిత నాయకులు కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌కి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో మచ్చలేని వ్యక్తి అని అలాంటి వ్యక్తిపై కొంతమంది కుట్రపన్ని ఈ కేసుల్లో ఇరికించారని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ దీనిపై ఎస్‌పికి సమాచారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు దళిత నాయకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రైలు కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రమాద వశాత్తూ రైలు కింద జారీ పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గూడూరు రైల్వే జంక్షన్ లో చోటు చేసుకుంది. గూడూరు రైల్వే పోలీస్ ల కథనం మేరకు గంగా కావేరి ఎక్స్ప్రెస్ లో ప్రయాణిస్తూన్న ఉత్తర ప్రదేశ్ కి చెందిన రవి కాంత్ (35) గూడూరు జంక్షన్ లో దిగి ఎక్కే క్రమంలో రైలు కింద పడి మృతి చెందాడని తెలిపారు. అనంతరం మృత దేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తిరుమలలో ఎర్రచందనం స్వాధీనం

అధికారులకు పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచల అటవీ పరిధిలో తిరుమల పాపనాశనం సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 10 ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ ఐ (ఆపరేషన్స్) సురేష్ కుమార్ రెడ్డి కి చెందిన ఆర్ఎస్ఐ టీ. విష్ణువర్ధన్ కుమార్ బృందం సోమవారం తిరుమల చేరుకుని అక్కడ నుంచి వేద పాఠశాల మీదుగా పాపనాశనం వైపు వెళుతుండగా అక్కడ నిషేధిత అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారని, వారిని హెచ్చరించి చుట్టుముట్టే ప్రయత్నం చేయగా వారు దుంగలు పడేసి పారిపోయారన్నారు. పారిపోతున్న వారిని వెంబడించి ముగ్గురిని టాస్క్ ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకుందన్నారు. ఆ ప్రాంతంలో 10ఎర్రచందనం దుంగలు లభించాయని అధికారులు తెలిపారు. పట్టుబడ్డ ముగ్గురు స్మగ్లర్లు తమిళనాడు తిరువన్నామలై జిల్లా, జమునామత్తూరుకు చెందినవారుగా గుర్తించామన్నారు. తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎస్ఐకి సత్కారం

ఎస్ఐని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-తొట్టంబేడు: తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్యను పలువురు టిడిపి నేతలు సోమవారం ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపిటిసి చంద్రారెడ్డి, బిసి సెల్ మండలాధ్యక్షుడు సురేంద్ర యాదవ్, భాస్కర్ నాయుడు ఎస్ఐను సత్కరించిన వారిలో ఉన్నారు. ఈశ్వరయ్యకు గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉందని ఆయన మంచితనంతో ప్రజలకు దగ్గరయ్యారని ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు. తొట్టంబేడు ఎస్ఐగా ఆయనను రాష్ట్ర పోలీస్ శాఖ నియమించడం శుభపరిణామని హర్షం వ్యక్తం చేశారు.

క్యాన్సర్ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : 'బయోటెక్నాలజీ, మెడిసిన్, క్యాన్సర్ థెరప్యూటిక్స్' మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఛాంబర్ లో సోమవారం విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు సోమవారం ఆవిష్కరించారు. ఎస్వీయు బయోటెక్నాలజీ విభాగం, యూనివర్సిటీ ఆఫ్ హెమటాలజీ, ఆంకాలజీ, యూనివర్శిటీ ఆఫ్ అలబామా బర్మింగ్‌హామ్ తో కలిసి 2024, డిసెంబర్ 27 నుంచి 29 వరకు ఎస్వీయూలో ఈ సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సు కన్వీనర్లుగా బయోటెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య కెవి సరిత, మెడికల్ ఆంకాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్ మల్లా మిథున్, డాక్టర్ పూర్ణచంద్ర నాగరాజు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య తులసి రామకృష్ణా రెడ్డి, ఆచార్య విజయసారథిరెడ్డి , సైన్స్ విభాగాల ఆచార్యులు పాల్గొన్నారు.

నేడు సాంఖ్యక శాస్త్ర విభాగంలో అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సాంఖ్యక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పద్మభూషణ్ ఆచార్య సిఆర్ రావు అతిథి ఉపన్యాసం ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లుగానే ఈ సంవత్సరం ఈనెల 10వ తేదీన ఎస్వీయూ సెనేట్ హాల్లో మంగళవారం నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య బి. సరోజమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అతిథి ఉపన్యాసంలో ముఖ్య అతిథులుగా ఎస్వీయూ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య తులసి రామకృష్ణారెడ్డి హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ అతిథి ఉపన్యాసంలో సాంఖ్యక శాస్త్ర విభాగ సాంఖ్యక శాస్త్రంలో నిష్ణాతులైన సీనియర్ ఆచార్యులచే అతని ఉపన్యాసం ఇప్పించడం ద్వారా విద్యార్థులకు సబ్జెక్టుపై అవగాహనతో కూడిన పరిజ్ఞానం అలవు డుతుందన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైవి రామిరెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏబిఆర్ఎస్ఎం ఆంధ్ర ప్రదేశ్ శాఖ అధ్యక్షులు ఆచార్య వైవిరాంరెడ్డిని ఆ సంఘం అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎన్. బాలసుబ్రహ్మణ్యం దృశ్యాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన కృషి అమోఘమని కొనియాడారు. విశ్వవిద్యాలయాలు డిగ్రీ కళాశాల అధ్యాపకుల పలు రకాల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. అధ్యాపకుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఆయనను సన్మానించడం భావ్యమన్నారు. రాష్ట్రంలోని అధ్యాపకుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని వైవి రామిరెడ్డి తెలిపినట్లు ఆయన తెలిపారు.

నేడు కేంద్ర సహాయ మంత్రి రాక

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : కేంద్ర పెట్రోలియం, సహజ వాయువులు,టూరిజం సహాయ మంత్రి సురేష్ గోపి ఈ నెల 10,11 వ తేదీలలో తిరుపతి జిల్లాలో పర్యటించ నున్నారని కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. తేది 10 న మంగళవారం మధ్యాహ్నం 3.40 గంటలకు బెంగళూరు విమానాశ్రయం నుండి బయలుదేరి 4.35 తిరుపతి చేరుకొని రాత్రికి బస చేస్తారు. తేది 11 న ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు చెన్నైకి రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లనున్నా రని కలెక్టర్ తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జెవివి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిరుపేద గర్భిణులకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. విఎస్ఆర్ స్కూల్ అధినేత నంది మండలం బాలకృష్ణ రాజు, విజయకు మార్ రెడ్డిల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పేరు మార్పు

నేను టంటం శివకుమార్(పాతపేరు) పాతకోట, వెంకటగిరి, తిరుపతిజిల్లా, ఆంధ్రప్రదేశ్ పేరున తమటం శివకుమార్‌గా (కొత్తపేరు) తండ్రి ప్రసాద్‌గా మార్చుకుంటున్నాను.

వేలం నోటీసు
జూనియర్ సివిల్‌జడ్జిగారికోర్టు, వెంకటగిరి
E.P.No.127/2011
O.S.No.94/2009
1) మల్లు మునీంద్ర తండ్రి మల్లు చిన్నయ్య
2) ఆవళ్ళూరు చాముండేశ్వరి భర్త రాజా
(లేట్ మల్లు చిన్నయ్య వారసులు
...డిక్రీహోల్డరు/వాది
V/S
గడ్డం సుబ్రమణ్యం తండ్రి పాపయ్య
...జడ్జిమెంట్‌డెటార్ / ప్రతివాది
ఇందుమూలముగా తెలియచేయుట ఏమనగా పై బాకీ వసూలు నిమిత్తం షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలము జరిపించేవలసినదిగా కోర్టువారు ఆదేశించి ఉత్తర్వులు మంజూరు చేసిన ప్రకారం షెడ్యూలు దాఖలా ఆస్తిని సివిల్‌జడ్జికోర్టులో 04-10-2024వ తేదిన వేలము నిర్వహించ బడును. వేలములో పాలొనదలచినవారు తేది.04.10.2024దిన ఉదయం 10గం॥లకు కోర్టులో హాజరుకావలసి యున్నది.
ఆస్థి షెడ్యూలు:- నెల్లూరుజిల్లా, ప్రసుత్తం తిరుపతిజిల్లా, వెంకటగిరిసబ్ డిస్ట్రిక్టు, వెంకటగిరిటవున్/మున్సిపాలిటి-మసీదు వెనుకవీధి (సంధు) - ఇంటి స్థలము మరియు బేస్‌మెంటు - డోర్ నెం.25-146 సమీపం, ప్లాట్ నెం.16, విస్తీర్ణం 1080చ॥అ॥లు లేక 120చ॥గజాలు
హద్దులు:- తూర్పు:-దారి, పడమర:-ప్లాట్ నెం.29 ఈశ్వరయ్యగారి మిద్దెఇల్లు, ఉత్తరం:-ప్లాట్ నెం.17 మస్తానయ్యగారి ఖాళీస్థలం, దక్షణం:-ప్లాట్ నెం.15 ఎస్.కె.ఖాదర్‌బాషా ఇల్లు, స్థలం ఇటు
ఎం.వి.ఎస్.గిరిజాకుమారి
డి. హెచ్. ఆర్. తరపు న్యాయవాది, వెంకటగిరి